క్లుప్తంగా

టూరిజం భవనాన్ని వినియోగంలోకి తేవాలి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న టూరిజం భవనాన్ని వినియోగంలోకి తెస్తూ, ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని శుక్రవారం జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను హైదరాబాద్‌లో కలిసి కోరారు. ఆయనకు స్థానిక సమస్యలను వివరించగా.. సానుకూలంగా స్పందించారని జెడ్పీటీసీ తెలిపారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు.

స్థలం కేటాయించాలి



వనపర్తి: పెబ్బేరు... వీపనగండ్ల మండల కేంద్రంలో మత్స్య సహకార భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరుతూ శుక్రవారం సర్పంచ్ నర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేష్‌గౌడ్‌కు మత్స్యసహకార సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. దాదాపు 400 మంది మత్స్య సహకార సంఘ సభ్యులు ఉన్న తమకు భవన నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో సీహెచ్ వెంకటయ్య, నర్సింహ, ఎల్లయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు



మదనాపురం: మండలంలోని తిర్మలాయపల్లి అంగన్‌వాడీ 1, 2 కేంద్రాల్లో శుక్రవారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ పద్మావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి భారతి మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను వివరించారు. తల్లిపాల ద్వారానే బిడ్డలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం ఎనిమిది మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద, కేవీకే శాస్త్రవేత్త అనిత, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, రాధ, హెచ్‌ఎం చంద్రకళ పాల్గొన్నారు .

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



పాన్‌గల్: లెట్ మీ ప్లే కవితా సంకల్పంలో రచనలు చేసిన మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం హెచ్‌ఎం మద్దిలేటి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన డాక్టర్ చింతోజి బ్రహ్మయ్య బాలమణి ఎడ్యుకేషన్ మెమోరియల్ ట్రస్ట్ వారు విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రశంసా పత్రాలను పోస్ట్ ద్వారా పంపించారని తెలిపారు.

ముందస్తు అరెస్టు



పాన్‌గల్: హైదరాబాద్‌లో చేపట్టే ధర్నాకు వెళ్లకుండా మండలంలోని వైద్య ఆరోగ్య శాఖలో సెకండ్ ఏఎన్‌ఎంలుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ హైదరాబాదులో శాంతియుతంగా చేపట్టే ధర్నాకు తరలి వెళ్లకుండా పోలీసులు అరెస్టు చేయడం సరికాదని ఏఎన్‌ఎంలు మండిపడ్డారు. అరెస్టు అయిన వారిలో సుమిత్ర, వసంత, నిర్మల, శైలజ, శాంత, మల్లేశ్వరీ, సునీత, నాగేశ్వరి ఉన్నారు.

కార్మికుల పోరాట ఫలితమే విలీనం

వనపర్తి టౌన్: ఆర్టీసీ కార్మికుల పోరాట ఫలితంగానే ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయ్యిందని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజనగరం రాజేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డిపోలో ఆర్టీసీ కార్మికులకు ఎమ్మార్పీఎస్ నాయకులు స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో నాయకుడు కొమ్ము చెన్న కేశవులు, ఆర్టీసీ కార్మికులు రమేష్, అయ్యుబ్, కర్ణాకర్, బీఎస్ నారాయణ, వెంకటేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



పాఠశాలల బలోపేతానికి కృషి

- 'మన ఊరు- మనబడి'తో అభివృద్ధి పనులు
- పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం
- పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ



డైనింగ్ హాల్ నిర్మాణం కోసం భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.80 లక్షలతో పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం కోసం పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మొదటి విడతగా పాఠశాలకు రూ.80 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ నిధులతో తరగతి గది, డైనింగ్ హాల్, బాత్‌రూంల నిర్మాణం, తరగతి గదుల మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉందన్నారు. వీటి కోసం గతంలో ఐదు పర్యాయాలు టెండర్లు నిర్వహించినా పనులు చేయడానికి ఎవ్వరూ ముందుకు రాలేదని, ప్రస్తుతం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చొరవతో పనులు చేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రావడం సంతోషకరమన్నారు. పాఠశాలలో మొత్తం 400 మందికి పైగా విద్యార్థులు ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్నారని, వీరి కోసం ప్రత్యేకంగా డైనింగ్ హాల్ వేగంగా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పట్టణ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్క సరోజ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, పంచాయతీరాజ్ ఏఈ నరేష్, హెచ్‌ఎం బలరాముడు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు కాపాడే వరకు పోరాటం



మాట్లాడుతున్న అఖిల పక్షం, ఆలయ పరిరక్షణ సమితి నాయకులు

పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయ భూమిలో కొనసాగుతున్న సంత స్థలంపై వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడిన తీరును అఖిలపక్షం నాయకులు, ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆగస్టు 2న పట్టణ కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరికలకు ఏర్పాటు చేసిన సమావేశానికి మంత్రి నిరంజన్‌రెడ్డి హాజరై పట్టణంలోని సంత భూమిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దేవాలయ భూములకు రక్షణ లేకుండా పోతుందని మండిపడ్డారు.

ఆలయ భూమిలో 'రియల్' వ్యాపారం

దేవాలయ పేరిట ఉన్న 30.19 గుంటల భూమిలో ఎన్నో ఏళ్లుగా సంత కొనసాగిస్తూ వందల కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. కానీ 16 ఎకరాలు సంతకు ఇచ్చి మిగిలిన భూమిని పూజారుల పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పగించేందుకు సిద్ధపడ్డారని దుయ్యబట్టారు. ఆలయ భూమి రక్షణకు భవిష్యత్ కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో బాలస్వామి, విజయవర్ధన్‌రెడ్డి, వేమారెడ్డి, దయాకర్‌రెడ్డి, గోనెల సహదేవుడు, రాములు యాదవ్, కంచే అంజనేయులు, వెంకట్రాములు, షకీల్, సత్యనారాయణ, నాగరాజు, బుచ్చన్న, నర్సింహ ఉన్నారు.

8 నుంచి క్రీడా పోటీలు

పెబ్బేరు రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 8న మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు శుక్రవారం మండల విద్యాధికారి జయరాములు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు బాలబాలికలు అండర్–14, అండర్–17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొనాల్సిందిగా కోరారు. వివరాలకు పీఈటీలు కురుమయ్య సెల్: 85001 65900, కమలాకర్ సెల్: 80086 24379 సంప్రదించాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



దొడగుంటపల్లిలో ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న రాజప్రకాష్‌రెడ్డి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లిలో శివాలయం నిర్మాణం కోసం రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గొని రాజ ప్రకాష్‌రెడ్డి రూ.5లక్షలు విరాళం అందించారు. అడిగిన వెంటనే స్పందించి తన వంతు సహాయంగా రూ.5లక్షలు విరాళంగా ఇచ్చిన రాజప్రకాష్‌రెడ్డికి ఆలయ నిర్మాణ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, తమకు తోచిన విరాళం అందజేయాలని నిర్వాహకులు దాతలను కోరారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భగవంత్‌రెడ్డి, నారాయణరెడ్డి, జానకీరాములు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయానికి..

మండలంలోని కానాయపల్లి సమీపంలో గల దత్త కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కోటిలింగాల ప్రతిష్ఠ, ధ్యాన కేంద్రం, పంచలోహ లింగం నిర్మాణం కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రానికి చెందిన పృథ్వీరాజ్, నిహారిక దంపతులు రూ.27,116 విరాళంగా ఆలయ నిర్వాహకులు శేఖరయ్యకు అందజేశారు. ఆలయంలో జరుగుతున్న పుణ్య కార్యక్రమాలకు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని నిర్వాహకులు కోరారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



కొత్తకోటలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

వనపర్తి టౌన్: బీఆర్‌ఎస్‌కు ఓటేసి గెలిపిస్తే మన గొయ్యి మనం తీసుకున్నట్టే అని మాజీ మంత్రి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ఆరోపించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత, గిరిజనులకు కుటుంబానికి మూడెకరాల భూమి, నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామన్న హామీలను సీఎం కేసీఆర్ విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల పండుగ సమయంలో హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని పట్టించుకోకపోవడం అలవాటుగా మారిందని, మళ్లీ ఎన్నికల సమయంలో గత ఎన్నికలకు ఇచ్చిన హామీల్లో ఒకటో, రెండో ఇస్తూ ప్రజలను మభ్యపెడుతున్నాడని నిప్పులు చెరిగారు. 22, 6, 7వ వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, నందిమల్ల యాదయ్య, కౌన్సిలర్ సుమిత్ర యాదగిరి, కొంకి వెంకటేష్, కృష్ణ బాబు, సమద్ మియా, ప్రవీణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో 20మంది చేరిక

జిల్లా కేంద్రంలోని 22వ వార్డు భగత్‌సింగ్‌నగర్‌లో 20 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు డాక్టర్ చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు వారిని ఆయన కండువా కప్పి ఆహ్వానించారు.

కొత్తకోట: రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు హామీలు ఇస్తూ 2023లో మరోసారి అధికారం చేపట్టేందుకు సీఎం కేసీఆర్ రైతులకు రుణమాఫీ, బీసీలకు బీసీ బంధు, యాదవులకు గొర్రెల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారని కాంగ్రెస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు, టీపీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పడిపోయిన ఇళ్లు, పూరి గుడిసెలను మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. గుడిసెలపై టార్పాలిన్ కవర్లు కప్పుకోవాలంటూ, ఇల్లు కూలిపోయిన వారికి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పేదలకు ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పి ఇవ్వకుండా తను మాత్రం రూ.100కోట్లతో పెద్ద భవంతి నిర్మించుకున్నాడని ఆరోపించారు. కొత్తకోటలో 100పడకల ఆస్పత్రి నిర్మాణం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు వంటి హామీలు గాలికొదిలేశారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ప్రశాంత్, బోయేజ్, పి.కృష్ణారెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, కౌన్సిలర్ నాగన్నసాగర్, గొల్ల బాబు, సలీంఖాన్, నరేందర్‌రెడ్డి, రాములు, శ్యాం, నాగేంద్రబాబు, భానుప్రకాష్‌రెడ్డి ఉన్నారు.

గోపాల్‌పేట: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం వారు రాహుల్‌గాంధీ అనర్హత వేటుపై సుప్రీంకోర్టులో ఊరట లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. పేదల పక్షాన ఉన్న కాంగ్రెస్ పార్టీయే ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని నినాదాలు చేశారు.

ఉత్సవాల ఖర్చులను విడుదల చేయండి



కలెక్టర్‌ను కలిసిన సర్పంచ్‌లు

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దశాబ్ది ఉత్సవాలకు సంబంధించి ఖర్చు చేసిన డబ్బులను ఇప్పించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌ను సర్పంచ్‌లు విన్నవించారు. శుక్రవారం మండలంలోని సర్పంచ్‌లు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి తమగోడు వెల్లబోసుకున్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండగకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేశామని, తహసీల్దార్‌కు సంప్రదిస్తే నిధులు ఇంకా విడుదల కాలేదని దాటవేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సొంత నిధులు సంబరాల కోసం వెచ్చించామని, ఆ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మీకాంత్‌రెడ్డి, తుకారాంనాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, కాతె బుచ్చన్న, భాస్కర్, మహిమూద్, అంజనేయులు ఉన్నారు.

రైతు సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం

పాన్‌గల్: రైతులు బ్యాంకుల ద్వారా తీసుకున్న పంట రుణాలు రూ.లక్ష వరకు మాఫీ చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంతో బీఆర్‌ఎస్ నాయకులు రైతులతో కలిసి సంబరాలు చేసుకుంటున్నారు. శుక్రవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి, దొండాయిపల్లి గ్రామాల్లో సీఎం కేసీఆర్, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటయ్యనాయుడు, గౌస్‌మియా, శేషయ్యనాయుడు, కుపేందర్, సుధాకర్‌రెడ్డి, సలాం, రైతులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు పక్షపాతి అని జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, మండల రైతు సమితి కోఆర్డినేటర్ వెంకటేశ్వర్ రావు, సింగిల్‌విండో అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డి చిత్రపటాలకు రైతులతో కలిసి వారు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడు విక్రం, గొడుగు సత్యం, బాల్‌లింగం, ఎస్పీ రమేష్, రవీందర్‌రెడ్డి, సాయిలు, రామస్‌గౌడు, వెంకటేష్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

వనపర్తి: రైతులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రూ.లక్ష రుణాన్ని మాఫీ చేస్తూ ప్రకటన విడుదల చేయడంపై వీపనగండ్ల మండలంలోని కల్వరాలలో ప్రజాప్రతినిధులు, రైతులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, మల్లయ్య యాదవ్, సత్యనారాయణగౌడ్, సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ నర్సింహ, రాజు, సర్దార్, సత్యం ఉన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు రైతులతో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, సర్పంచ్ వినీలారాణి, గౌడ్‌నాయక్, పృథ్వీరాజు, వెంకటస్వామి, శివ, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: సీఎం కేసీఆర్ రైతు రుణమాఫీపై ప్రకటన చేయడంతో పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధయ్య, మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, భీంరెడ్డి, నాగేంద్ర సాగర్, లక్ష్మణ్‌గౌడ్, నర్సింహారెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వడ్డెవాటలో..

కొత్తకోట మండలంలోని వడ్డెవాటలో బీఆర్‌ఎస్ నాయకులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాములు, రవి, రాంచంద్రయ్యగౌడ్, శంకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



మదనాపురం తహసీల్దార్ అబ్రహం లింకన్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కొత్తకోట రూరల్: పెద్దమందడి తహసీల్దార్‌గా కిషన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ సంధ్య సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు. అడ్డాకుల తహసీల్దార్‌గా పనిచేస్తున్న కిషన్‌ను పెద్దమందడి తహసీల్దార్‌గా నియమించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో సేవలు అందించేందుకు కృషి చేస్తానని, ప్రజల సమస్యలు, అవసరాలకు అనుగుణంగా పనిచేస్తానని తహసీల్దార్ తెలిపారు.

'ఖిల్లా' తహసీల్దార్‌గా పాండునాయక్

ఖిల్లాఘనపురం: మండల నూతన తహసీల్దార్‌గా పాండునాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొన్ని నెలలుగా మండలంలో రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో నాయబ్ తహసీల్దార్ పరమేశ్వర్ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన పాండునాయక్ బదిలీపై ఖిల్లాఘనపురం తహసీల్దార్‌గా వచ్చారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే ఇన్‌చార్జ్ తహసీల్దార్ పరమేశ్వర్, ఆర్‌ఐ కురుమూర్తి తదితర కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, నాయకులు లింగస్వామి, అనిల్‌కుమార్ తహసీల్దార్‌ను కలిసి శాలువాతో సన్మానించారు.

వీపనగండ్ల తహసీల్దార్‌గా వరలక్ష్మి



శ్రీనివాసులు



వరలక్ష్మి



కిషన్

వనపర్తి: వీపనగండ్ల తహసీల్దార్‌గా ఆర్ వరలక్ష్మి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నిబంధనల్లో భాగంగా గతంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న పాండునాయక్‌ను నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ చేశారు. గద్వాల కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వరలక్ష్మిని వీపనగండ్ల తహసీల్దార్‌గా నియమించారు.

మదనాపురం తహసీల్దార్‌గా అబ్రహంలింకన్

మదనాపురం: స్థానిక తహసీల్దార్‌గా శుక్రవారం అబ్రహంలింకన్ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ నరేందర్‌ను నారాయణపేట జిల్లాకు బదిలీ చేయడంతో పెబ్బేరు తహసీల్దార్‌ను ఇక్కడ నియమించారు. డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కుమార్, సిబ్బంది తహసీల్దార్‌ను శాలువాతో సత్కరించారు.



ఖిల్లాఘనపురంలో..

గోపాల్‌పేట తహసీల్దార్‌గా శ్రీనివాసులు

గోపాల్‌పేట: మండల తహసీల్దార్ శ్రీనివాసులుగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ సునీత నారాయణపేట జిల్లాకు బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు.


మునగ తోటల సాగుపై అవగాహన పెంచాలి

పాన్‌గల్: మండలంలో మునగ తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ చాంబర్‌లో ఐకేపీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కదిరెపాడు, చింతకుంట గ్రామాల్లోని నర్సరీల్లో 4 వేల మునగ మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఐకేపీ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకొని క్షేత్ర స్థాయిలో వీటి సాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగును ప్రోత్సహించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, ఏపీఎం చైతన్య, సీసీ స్వామి ఉన్నారు.

రూ.లక్ష సాయం అందించాలి

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు ప్రకటించిన రూ.లక్ష సాయాన్ని క్రిస్టియన్లతో పాటు ముస్లింలకు అందించాలని ముస్లిం మైనార్టీ నాయకులు మీర్జాఅక్తర్‌బేగ్, మోసిన్, వాహీద్, లైక్‌పాష డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో ముస్లిం మైనార్టీలు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారికే రూ.లక్ష పథకం వర్తిస్తుందనడం భావ్యం కాదన్నారు. వేల సంఖ్యలో నిరుపేద ముస్లింలు ఉన్నారని, అర్హులైన వారందరికీ దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

బస్సు కోసం విద్యార్థులు రాస్తారోకో



పాన్‌గల్: బండపల్లి, జమ్మాపూర్ గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ నెల రోజులుగా ఈ గ్రామాల మీదుగా నడుస్తున్న ఆర్టీసీ బస్సును రద్దు చేయడంతో విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాస్తారోకో చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రాస్తారోకోను విరమింపజేశారు. ఆయా గ్రామాల మీదుగా ఉన్న రోడ్డుపై కల్వర్టు నిర్మాణాలు చేయడంతో పంట పొలాల మీదుగా ప్రత్యామ్నాయ రోడ్డు చేసినా.. వర్షాకాలం కావడంతో పంట పొలాల మీదుగా బస్సులు వెళ్లడం వీలు కాక బస్సులను రద్దు చేశారని వివరించారు.

మైనార్టీలపై దాడులు ఆపాలి

అమరచింత: మణిపూర్, హర్యానాలో కొన్ని రోజులుగా ముస్లిం మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని, వారిని చిత్రహింసలకు గురిచేస్తూ చంపేస్తున్నారని, వెంటనే దాడులు ఆపాలంటూ ముస్లిం మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నిస్సార్, తౌఫిక్, నబీ, అల్తాఫ్, ఖాసీం, ఖలీల్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై మొండి వైఖరి వీడాలి



వనపర్తిలో దీక్షా శిబిరం వద్ద రోడ్డుపై భోజనం చేస్తున్న కార్మికులు

కొత్తకోట: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జూలై 6 నుంచి చేపడుతున్న సమ్మెలో భాగంగా శుక్రవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి కొత్తకోట నుంచి పంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బొజ్జన్న, కరీం, రాములు, సాయిలు, మౌలాలీ, సుదర్శన్‌రెడ్డి, తిరుపతయ్య, వెంకటేష్, గోపాల్, బాలయ్య, అశోక్, కురుమూర్తి, వాసు, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు 30 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడంలో మొండి వైఖరి ప్రదర్శిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామేశ్వరాచారి, సీపీఎం మండల కన్వీనర్ దేవేందర్ అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మెకు వారు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో రాము, నాగన్న, బాలస్వామి, మద్దిలేటి, సుగ్రీవుడు, రంగాస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో చేపట్టిన జీపీ కార్మికుల సమ్మెకు సీఐటీయూ జిల్లా సభ్యుడు పుట్టా ఆంజనేయులు మద్దతు తెలిపారు. అనంతరం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. వనపర్తి మండల కమిటీ అధ్యక్షుడిగా హన్మంత్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా చంద్రయ్య, కోశాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు రాంచంద్రయ్య, మిద్దె రాములు, తిరుపతయ్య, సహాయ కార్యదర్శి స్వామి, సతీష్‌తో పాటు 18 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శిబిరంలో కార్మికులు వంటావార్పు కార్యక్రమం నిర్వహించి రోడ్డుపై భోజనాలు చేశారు.

అమరచింత: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనేందుకు అమరచింత నుంచి ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మిక సంఘం నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ శుక్రవారం హైదరాబాద్‌లో కార్మిక గర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సామేలు, రాజన్న, జిలాని, కురుమన్న, భక్తి, ప్రేమరత్నం ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

వనపర్తి: ఫ్రై డే.. డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాయినగర్ కాలనీలో పర్యటించారు. మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ ఉంచిన నీటిలో దోమల లార్వాలను చూపించి ప్రజలకు అబేట్ ద్రావణాన్ని చల్లారు. కార్యక్రమంలో జిల్లా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్‌జీ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

వనపర్తి: అత్యవసరముంది.. రెండు మూడు రోజుల్లో తిరిగి ఇస్తానని నమ్మబలికి కొంత బంగారం, డబ్బులు తీసుకుని మహేష్ అనే వ్యక్తి కనిపించకుండా పోయాడని జిల్లా కేంద్రంలోని బ్రహ్మంగారి వీధికి చెందిన ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్‌కు చెందిన మహేష్ గత ఐదేళ్లుగా కంసాలి వృత్తి పని చేసుకుంటూ వనపర్తిలోనే నివాసం ఉంటున్న కారణంగా నమ్మి బంగారం, డబ్బులు ఇచ్చానని తెలిపారు. ఆయన డబ్బులు ఇచ్చే సమయంలో స్థానికులు పలువురు తనతో పాటు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. చెప్పకుండా కుటుంబంతో సహా ఎక్కడికో వెళ్లిపోయాడని, కనీసం సెల్ నెంబర్లు పనిచేయకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ.20వేలు అందజేత

వనపర్తి: కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో నిర్మించనున్న ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంఘ భవన నిర్మాణం కోసం ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబావి మండలాల ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం నాయకులు తమ సంఘం నుంచి శుక్రవారం రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో అంజి యాదవ్, రాఘవేంద్ర, గఫార్, అబి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



కొత్తకోట రూరల్: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరంలాంటిదని సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని వడ్డెవాటకు చెందిన కె.తిరుపతిరెడ్డికి 15,500, ఆటో శ్రీనుకు రూ.12వేలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరు అయినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శంకర్‌బాబు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించాలి

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలని నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని మాందాపూర్, రేమద్దుల గ్రామాల్లో పర్యటిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అన్వేష్, నాగరాజునాయుడు, జగన్‌గుప్తా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.